# తప్పటడుగు

ఆకునూరి ఉషాదేవి

శ్రీమత్సుందర జామాతృ ముని మానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.
మంగళాశాసన పరైర్మదాచార్య పురోగమైః
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు
మంగళమ్.

సన్నని కంఠం పూజా గృహంలోనుండి వచ్చి తాకింది మోహన్ చెవులకు. కప్పుకున్న దుప్పటి తీసేసి, వదిన పూజ అయిపోయినట్టుంది అప్పుడే అని అనుకుంటూ లేచి వెళ్ళాడు పక్కమీదనుండి. మోహన్ ముఖం కడుక్కొని వచ్చేటప్పటికి మాధవి పూజ ముగించుకుని వచ్చి మోహన్‌కు కాఫీ, టిఫిన్ తెచ్చి పెట్టింది.

"వదినా! అన్నయ్య ఇంకా లేవలేదా?"

"లేదు, బాబూ! రాత్రి ఆలస్యంగా పడుకున్నారు, ఏదో పుస్తకం చదువుతూ. ఈ రోజు సెలవేకదా! అందుకే నేనూ లేపలేదు."

"నువ్వూ టిఫిన్ తీసుకో, వదినా! అన్నయ్య లేచే టప్పటికి ఆలస్యం అవుతుందేమో."

"ఫరవాలేదు, బాబూ! మీ అన్నయ్యను రానీ." మాధవి వంటపనిలో పడిపోయింది.

* * *

"వదినా! ఈ వారం నా కథ పడ్డది!" ఆనందంగా వదినకు చూపించాడు మోహన్.

మాధవి అందుకొని, మోహన్ వ్రాసిన కథ చదవటం మొదలుపెట్టింది.

"వదినా, ఎలా ఉంది?"

"బాగానే ఉంది, బాబూ!"

"అలా అంటే నేను ఒప్పుకోను. నువ్వు ఎంతో విమర్శిస్తావని ఆశపడ్డాను, వదినా! నువ్వు ఏదైనా సలహాలు ఇవ్వాలి. ఏదైనా చెప్పాలి. అప్పుడు గాని నాకు తృప్తి ఉండదు."

మోహన్ మాటలకు నవ్వుకుంది మాధవి.

"నేనూ చెప్పాలనే అనుకున్నాను, బాబూ! నువ్వు నిరుత్సాహపడతావేమోనని సంకోచిస్తున్నాను."

"ఫరవాలేదు, వదినా! చెప్పు."

"చూడు, మోహన్! అసలు ఈ 'చీకటితెరలు' అనే కథ ఏ ఉద్దేశ్యంతో వ్రాశావు? ఇందులో పూర్తిగా జరిగే అన్యాయాలు, అక్రమాలు ఇవే ఎక్కువగా ఉన్నవి. అందువలన ఏమిటి ఉపయోగం?"

"వదినా! వాస్తవికంగా ఈనాడు జరుగుతున్నదే వ్రాయాలనే అభిప్రాయం నాలో కలిగింది. ఊహలలో తేలిపోతూ, నిజజీవితంలో తొంగి అయినా చూడని ఆదర్శాలను కథలలో వ్రాసుకొని ఏం ప్రయోజనం?

స్త్రీ ఎంత త్వరగా ప్రేమించగలదో, అంత త్వరగా ద్వేషించగలదు. ఎంత గాఢంగా ప్రేమించగలదో, అంత తీవ్రంగా అసహ్యించుకోగలదు. స్త్రీ హృదయం నాటికీ, నేటికీ పురుషుడికి ఒక జవాబు దొరకని ప్రశ్న.

జరగనివాటిని జరుగుతున్నవని వ్రాసి పాఠకుని భ్రమింపచేయలేను నేను. నేను వ్రాసింది మంచిగానీ, చెడుగానీ జీవితానికి దగ్గిరగా ఉండేటట్టు వ్రాశాను."

"అదే నేనూ అంటున్నాను, బాబూ! సంఘంలో అన్యాయాలు, అక్రమాలు జరుగుతూనే ఉన్నవి. కాదనటం లేదు. వాటిని నువ్వు యథాతథంగా కాగితం మీద పెట్టావు. అందువలన నీకుగాని, చదివే పాఠకుడికి గాని వచ్చే లాభమేమిటి? నువ్వు రచనలో వాస్తవికానికి దగ్గిరగా ఉండటమే ప్రధానంగా పెట్టుకున్నావు. ఇంకేం ఆలోచించలేదంటాను. ఏ ఉపయోగం కలుగుతుంది నీ రచన చదివినందువలన? ఏ సత్యాన్ని పాఠకుడు నీ నుండి గ్రహింపగలడు? నీ కథ జీవితానికి దగ్గిరగా ఉందంటూ, సంఘంలో అవినీతిని చాటి, ఇంకా మనుష్యులచేత అదే పద్ధతి అనుసరింపచేస్తావా? ఏ కథ అయినా చెడుని చూపినపుడు, మంచిని కూడా చూపాలి. జరుగుతున్న అన్యాయాలను చూపినపుడు, వాటిని పరిష్కరించుకునే మార్గాలు కూడా చూపాలి. అప్పుడే నీ రచన వలన కొంచెమైనా పాఠకుడికి ఉపయోగం అనేది ఉంటుంది. అసలు పాఠకులు పుస్తకాలు ఎందుకు చదువుతారు, చెప్పు?"

"దానిదేముంది, వదినా! కొందరు విజ్ఞానానికి, కొందరు వినోదానికి, కొందరు కాలక్షేపానికి చదువుతారు."

"చూడు, బాబూ! ఈనాటి సమాజంలో ఎటు చూసినా, ఏ రంగంలో చూసినా అవినీతి ప్రబలంగా కన్పిస్తూనే ఉన్నది. కొందరు ఈ అన్యాయాలను ఎదుర్కొనలేక, 'అందరూ చేస్తున్నారు కదా! మనం చేస్తే తప్పేమిటి?' అనే ముసుగు వేసుకొని, న్యాయాన్యాయ విచక్షణ శక్తిని కోల్పోతున్నారు. అదే ఇంకొకరికి బోధిస్తున్నారు. ఈ పరిస్థితులమధ్య పాఠకుడు చదివే కథ కూడా ఇలా పూర్తిగా అవినీతిని నింపుకొని ఉంటే చదివే పాఠకుడు ఏమనుకుంటాడు? అంతా ఇలాగే ఉందిలే అని తేలికగా ఆలోచించి ఇంకా తన జీవితాన్ని అన్యాయానికే అంకితం చేస్తాడు. ఇదేనా నువ్వు చేయవలసినది? కనీసం కథల్లోనయినా అందరూ నీలాంటివాళ్ళే కారోయి, గంపెడు గులకరాళ్ళల్లో రత్నంలా మెరిసే మానవత్వమున్న మనుష్యులు కూడా ఉన్నారని నువ్వు చాటాలి. నువ్వూ ప్రయత్నిస్తే ఆ రత్నంలా మెరవటానికి అవకాశముంది అని బోధించాలి. రచయితగా అది నీ కర్తవ్యం. మనుష్యులలో సుఖపడటానికి ఎన్ని మార్గాలున్నాయో, అన్నిటినీ ఇది న్యాయం, ఇది అన్యాయం అనే ఆలోచనలేకుండా ఎన్నుకునేవారున్నారు. నిజమే. కానీ ఉన్నతమైన సంస్కారంతో, ఇంకొకరిని ఎలా సుఖపెట్టగలమా అనే తలంపుతో, అందరికీ సుఖ శాంతులను ప్రసాదింపగల ఉన్నత వ్యక్తులుకూడా ఉన్నారని నువ్వు చూపాలి. బాబూ! సంఘంలో మంచి, చెడులను రెంటినీ తెలిపి, మంచిని మానవుడు గ్రహింపగలిగేటట్లు చేయటం రచయితగా నీ కర్తవ్యం. భావం బాగున్నంతమాత్రాన, శైలి అమోఘంగా ఉన్నంతమాత్రాన అది ఉత్తమ కథ అనబడదు. అసలు కథకాదు ముఖ్యం. ఆ కథద్వారా నువ్వు ఏ సత్యాన్ని పాఠకుడికి బోధిస్తున్నావనేదే ముఖ్యం. బాబూ! నువ్వు ఏ కథావస్తువును తీసుకున్నా సరే, దానినుండి పాఠకుడు కొంత మంచిని గ్రహించగలిగేటట్టు ఉండాలి. అసలు నీలో ఈ బలహీనతకు గల కారణం ఏమిటంటే, నువ్వు సమాజాన్ని ఒక పక్కనుండే చూస్తున్నావు. ఒక పక్కనే ఉండి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నావు. సమాజం అన్నది మంచిచెడ్డల కలయిక అని, వెలుగున్నచోట నీడ ఉన్నట్లు, మంచివారి వెలుగులో చెడ్డవారి నీడ కదులుతూ ఉంటుందని నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. నువ్వు సమాజాన్ని ఒక పక్కనుండే చూడటంతో ఎక్కువగా ఉన్న నీడే నీకు కనిపిస్తుంది. దాని వెనక ఉన్న వెలుగును నువ్వు చూడలేక పోతున్నావు. మంచివారిని నువ్వు అర్థం చేసుకోలేకపోతున్నావు. సమాజాన్ని అర్థంచేసుకోవటంలో నువ్వు ఇలా తప్పటడుగు వేస్తున్నావు. మోహన్! నేను చెప్పింది సమంజసంగా ఉందో, లేదో ఆలోచించు. వస్తాను" అంటూ మాధవి లేచి వెళ్ళింది.

* * *

"ఆనందరావుగారికి కారు యాక్సిడెంటు అయింది. కొద్దిగా దెబ్బ తగిలింది. హాస్పిటలులో ఉన్నారు. మీరు నాతో రండి."

ఆఘాతం తగిలినట్టు నిలబడిపోయింది మాధవి. విపరీతమైన భయంతో శరీరం వణికిపోయింది. అలాగే ఆ వచ్చిన వ్యక్తిని అనుసరించింది. ఆనందరావుని చూసిన తరవాతగాని మాధవికి కంగారు, ఆందోళన తగ్గలేదు.

"ఫరవాలేదు, మాధవీ! చిన్న దెబ్బే. రేపే వచ్చేస్తాను ఇంటికి. కంగారుపడకు" అన్నాడు ఆనంద్.

కన్నీళ్ళు తుడుచుకుని తేలికగా ఊపిరి పీల్చుకుంది మాధవి.

ఆ మరునాడే ఆనంద్ ఇంటికి వచ్చాడు. ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టాడు.

"అన్నయ్యా! ఆ కారు నెంబరు ఇదిగో. ప్రమాదం జరిగితే నువ్వు ఎలా ఉన్నావో, ఏమిటో అనే ఆలోచనే లేకుండా, వాడి దారిన వాడు పోయాడు." అసహ్యించు



కుంటూ, ఆవేశంగా అన్నాడు మోహన్.

"అయితే ఇప్పుడు నువ్వు ఏమి చెయ్యాలనుకుంటున్నావు?"

"వాడి అంతు తేల్చుకోవాలి, వదినా!" కోపంగా అన్నాడు మోహన్.

"చూడు, మోహన్! నేనొకటి చెబుతాను, నేరం చేసిన వాడిని నిందిస్తుంది సమాజం. అయితే ఆ నేరం ఎందుకు జరిగింది, ఎలా జరిగింది, ఏ పరిస్థితులలో జరిగింది—ఇవేవీ ఆలోచించదు. ఒకసారి నువ్వు ఆలోచించు. అతడెవరో మనకు తెలియదు. మనం ఎవరమో అతడికి తెలియదు. మనం అంటే ఆ వ్యక్తికి ఎటువంటి కోపంగాని, కక్షగాని లేవు. కానీ అనుకోకుండా ప్రమాదం జరిగిపోయింది. గాయపడిన వ్యక్తిని చూసి సమాజం జాలిపడుతుంది. అందుకు కారణ భూతుడైన వ్యక్తిని చూసి నిందిస్తుంది. మన సమాజంలో సంస్కారం అంతవరకే ఉన్నది, బాబూ! ఇంకేమీ ఆలోచించలేదు. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు వ్యాఖ్యానాలు చేసుకుంటూ దాటుకొని పోతూంటారు. కానీ ఆ నేరస్థుణ్ణి గురించి ఎవరూ ఆలోచించరు. మనం ఎంత దిగజారిపోతున్నామో చూడు. దెబ్బ తగిలిందని మనం ఎంతో బాధపడ్డాం. కానీ అనుకోకుండా ఇంకొ వ్యక్తిని అకారణంగా నేను గాయపరిచాను అని ఆ వ్యక్తి మానసికంగా ఎంత బాధపడతాడో, ఎంత కుమిలి పోతాడో ఎవరైనా ఆలోచిస్తున్నారా? అతనూ మనిషే!

వాయిదాల మీద ట్రాన్సిస్టర్



రు. 285/- ఖరీదయే ప్రపంచ ప్రసిద్ధమైన నేషనల్ డీలక్స్ 3 బాండ్స్ అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను రు. 10/- ల నెలసరి వాయిదాల మీద తెప్పించుకొనండి. ప్రతిపత్రికు, బస్తీకి పంపవమును. వ్రాయండి.

**IMPEX INDIA (WAP)**
**P.B. 1045, DELHI-6.**

దైవజ్ఞరత్న, విద్యావిశారద
శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు
గారి ఉత్తమ జ్యోతిష గ్రంథములు

1. మహా పురుషాది యోగములు. 2. రాజయోగ ఫల ప్రదర్శనము. 3. రాజయోగములు. 4. **Benefics and Malefics** (రాహు కేతులు). 5. జాతకబలము -ఫలము. 6. ధనయోగ ఫల ప్రదర్శనము. 7. సీత. 8. ఆయుర్భావము. 9. పరాశర హోర — 1 వ భాగము, 10. పరాశర హోర — 2 వ భాగము. వెల 1 కి రు. 5—00 లు. పది గ్రంథముల సేకరించు వారలకు పోస్టేజితో సహా రూ. 45 -లు మాత్రమే.

ఈ గ్రంథములు సర్వ ఋషి ప్రోక్తములగు మూలసూత్ర, అనువాద, అనుభవ ఉదాహరణ జాతకములతో తయారు చేయబడినవి.

ప్రాప్తిస్థానము:—
B-22/3, విజయనగర కాలని, హైదరాబాద్-28

వసంతకాలం వచ్చింది
ఉన్ని గుడ్డలను, శాలువలను
అన్నింటిని
వేసవి వెళ్ళేవరకు ఎత్తిపెట్టటానికి
ముందుగ డ్రైక్లీన్ చెయ్యాలి
పురుగులు కొట్టి చెడిపోకుండా
కాపడలకు గాలిచొరని పాలిథీన్
ప్యాకింగ్ కావాలనండి.
మా 19 బ్రాంచీలు మిమ్ము సేవించ సిదంగా ఉన్నాయి.
ఫాషన్స
(రిజిష్టర్డ్)
ఎలక్ట్రిక్ డ్రై క్లీనర్స
A.A.


అతడిలోనూ మానవత్వముంది. ఒక అపరిచిత వ్యక్తిని నాకు తెలియకుండానే గాయపరిచాను అని ఆ వ్యక్తి మానసికంగా అనుభవించే బాధ మనం అనుభవించే బాధకన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఈ న్యాయస్థానాలు, ఈ సమాజం విధించే శిక్షకన్నా అతడు అనుభవించే బాధ తక్కువేమీ కాదు. అందుకే అతడిని చూచి జాలిపడు, బాబూ!''

''వదినా! నీ మంచితనానికి హద్దు అనేది లేదా? మనం అతణ్ణి చూసి జాలిపడాలా? లేక అతడు వచ్చి క్షమాపణ చెప్పుకోవాలా?'' అనేశాడు మోహన్.

''చూడు, బాబూ! ఇప్పటికి ఆ వ్యక్తి ఎన్నోసార్లు పశ్చాత్తాపంతో కుమిలిపోయి ఉంటాడు. ఇక క్షమాపణ అడగమంటావు కదూ! అతడిలో మానవత్వం అనేది ఉంటే, తప్పక వస్తాడు క్షమించమని. అయినా మనం అతడు రాకపోయినా ఆశ్చర్యపోవలసిన అవసరంలేదు. ఎందుకంటే అసలు మనం అందుకు ఎక్కడ అవకాశం ఇస్తున్నాం? ఈ పరిస్థితులలో ఉన్న ప్రతి వ్యక్తి నేరస్తుణ్ణి సానుభూతితో అర్థం చేసుకుని ఉండిఉంటే, గాయపరిచిన ప్రతివ్యక్తి క్షమించమని వచ్చి అడిగేవాడు. అటువంటి పరిస్థితిని మన సమాజం కల్పించలేదు. నా అభిప్రాయం ఇది. తరవాత నీ ఇష్టం, బాబూ!''

''వదినా! అందరినీ ఇలా క్షమిస్తూ పోతే, ఇక వాళ్ళ నిర్లక్ష్యానికి అంతు ఉండదు. తప్పు జరిగినప్పుడు దానికి తగిన శిక్ష పడాలి. అది న్యాయం. నువ్వు ఇలా క్షమించటం వాళ్ళను ఇంకా అన్యాయంగా బ్రతకమని ప్రోత్సహించినట్లు అవుతుంది. సమాజంలో మంచిని పెంపొందించటం, చెడును రూపుమాపటం మన కర్తవ్యం కదా, వదినా!''

''అవును, బాబూ! నువ్వు చెప్పింది నిజమే. మంచి వారిని మంచిగా అర్థం చేసుకో. చెడ్డవారిని చూసి జాలిపడు. కానీ ఆగ్రహంతో, ఆవేశంతో వాళ్ళను మంచివాళ్ళగా మార్చాలనే తలంపుతో, వారిలో ఉన్న మంచిని పగొట్టుకోకు. అదే నేను నీకు చెప్పేది'' అన్నది మాధవి

''మోహన్! ఆ కారు నెంబరు ఇటివ్వు.'' అడిగాడు ఆనంద్.

''ఇదిగో, అన్నయ్యా!'' జేబులోనుండి తీసి ఇచ్చాడు మోహన్.

ఆనంద్ ఆ కాగితాన్ని అందుకొని నలిపి ఉండచేసి, కనిపించనంత దూరానికి విసిరివేశాడు.

మోహన్, మాధవి ఆశ్చర్యపోయారు.

'అన్నయ్యా!''

''అవునురా! మీ వదిన ఏం చెప్పినా మంచే చెబుతుంది. మంచిమాటలు వినకపోవటం మన అవివేకమే అవుతుంది.''

'నేనెంత అదృష్టవంతురాలిని!' అని అనుకుంటూ మాధవి భర్త కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయింది.

* * *

''ఆనందరావుగారున్నారాండీ!''

''రండి, పిలుస్తాను!'' లోపలికి వెళ్ళి ఆనంద్‌ను పిలుచుకు వచ్చాడు మోహన్. ఆనంద్ ఆ వ్యక్తిని చూడగానే క్షణకాలం ఆశ్చర్యపోయాడు. అతని ముఖం బాగా గుర్తులేదు. కాని కొంచెం లీలగా గుర్తుంది.

''మీరు నన్ను క్షమించాలి. ఆ రోజు కారు ఆక్సిడెంటు అయిన రోజున, నేనే కారు డ్రైవ్ చేస్తున్నాను. క్షమించండి! ట్రెయిన్‌కు టైము అయిపోతుందని స్పీడుగా వెళుతున్న నాకు మీరు కారుదగ్గిరికి వచ్చేయటం గమనించలేకపోయాను. అకస్మాత్తుగా మీకు దెబ్బ తగిలేసరికి నాకు మతి పోయింది. మీతోపాటు హాస్పిటలుకు రావాలనుకున్నాను. కానీ అర్జెంటుగా ఊరు వెళ్ళవలసి ఉంది. ట్రెయిన్‌కు ఇంకో పదినిమిషాలే వ్యవధి ఉంది. అందుకే మిమ్మల్ని కలుసుకోలేకపోయాను. మీరు పడిపోగానే ఆ రోజు మీ జేబులోనుండి ఈ డైరీ, రెండు రూపాయల నోటు రోడ్డుమీద పడిపోయాయి. ఆ డైరీలో ఉన్న మీ అడ్రసునుబట్టి మీ ఇల్లు కనుక్కొని వచ్చాను. మీరు ఇప్పుడు కులాసాగా ఉన్నారు కదా! ఇవి తీసుకోండి.'' రెండురూపాయల నోటు, డైరీ అందించాడు ఆ వ్యక్తి. వింటున్న మోహన్, ఆనంద్ ఆశ్చర్యపోయారు.

''చాలా సంతోషం.'' అతడి నిర్భయత్వానికి, నిజాయితీకి సంతోషించాడు ఆనంద్.

''మీ పేరు?''

''నా పేరు రాజశేఖర్. ఇక్కడ స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్నాను.''

''నా పేరు ఆనంద్. ఇక్కడ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను.''

''చాలా సంతోషం. మనం అనుకోకుండా ఇలా కలుసుకున్నాం. వస్తానండి. నాకు ఆఫీసుకు టైమ్ అవుతూంది'' అంటూ లేచి వెళ్ళాడు రాజశేఖర్.

''వదినా! నువ్వే గెలిచావు. నువ్వు ఊహించినట్లుగా అతడు వచ్చి క్షమించమని అడిగాడు. నా వాదన అంతా నిష్ప్రయోజనం అయింది.'' మోహన్ వెంటనే వదినకు తెలియజేశాడు.

''నిజంగా! వచ్చాడా!'' ఆశ్చర్యపోయింది మాధవి. సంస్కారంతో ప్రవర్తించాడు ఆ వ్యక్తి. ఎందుకో అతణ్ణి చూడాలనిపించింది మాధవికి. చేస్తున్న పని అక్కడే వదిలిపెట్టి, హాల్లోకి వచ్చింది.

గేటు దాటుతున్న వ్యక్తిని చూసేసరికి మాధవి ఆనందంతో మతి పోయింది. అదే నడక, అదే ఎత్తు.

''రాజా! రాజా!'' మెట్లు దిగి వెళ్ళి పిలిచింది.

వెళుతున్న రాజశేఖర్ వెనక్కి తిరిగి చూశాడు.

''మాధవీ! నువ్వా!''

''రాజా!''

ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారిద్దరూ!

''ఎంత విచిత్రం! ఒకే ఊరిలో ఉండి, మనం ఇంతవరకూ కలుసుకోలేకపోయాం. అప్పుడప్పుడు వస్తూ ఉండు, రాజా!''

''తప్పక వస్తాను. నన్ను ఇప్పుడు వెళ్ళనీ. ఆఫీసు టైమ్ అవుతూంది. వస్తాను'' అంటూ రాజశేఖర్ అక్కడనుండి కదిలాడు.

మాధవి ఆనందంతో వెనక్కి తిరిగింది ఈ విషయం భర్తతో చెప్పాలని.

మాధవి చెప్పేంతలో ఆనందరావు అడిగేశాడు:

''అతడు నీకు తెలుసా?''

''అవునండీ! గుంటూరులో ఉండేటప్పుడు మా ఇంటిదగ్గిరే వాళ్ళ ఇల్లు. అప్పట్లో అతడు బి. కాం. చదువుతూ ఉండేవాడు. నేను చదివిన కాలేజీలో చదివాడు. రాజశేఖర్ పేరు.''

ఆనంద్‌కు చటుక్కున గుర్తు వచ్చింది, మాధవి అతడిని "రాజా!" అని పిలిచినట్టు. క్షణంసేపు అతడి కనుబొమలు ముడుచుకున్నవి. 'రాజా! అని పిలవ గల చనువు ఉందా మాధవికి? ఒకే కాలేజీలో చదివి నంతమాత్రాన, అంత పరిచయం ఉండటం అనవసరం' అనుకున్నాడు ఆనంద్.

"చూశావా, మోహన్! ఆ రోజు అనవసరంగా ఆవేశపడ్డావు ఏదో చేసెయ్యాలని. మనిషిలో మానవత్వ మనేది ఉండి ఉంటే చాలు, ఇక ఆ వ్యక్తి ఏ పరి స్థితులలోను జీవితంలో ఓడిపోడు." తన స్నేహితుణ్ణి కలుసుకున్నాననే ఆనందంతో గర్వంగా అన్నది మాధవి.

మాధవి ముఖంలోని ఆనందాన్ని చూసిన ఆనంద రావులో ఏదో తెలియని ఈర్ష్య లేచింది. అతణ్ణి చూడగానే మాధవి ముఖంలో వింతకాంతి, గర్వంతో కూడిన ఆ ఆనందం ఎందుకు వచ్చాయి? ఆనందరావు మనసులో అనుమాన బీజం మొలకెత్తింది. 'మాధవికి అంత ఆత్మీయుడా?' జవాబు దొరకని ప్రశ్నలు వేధించటం మొదలుపెట్టాయి.

పదినిమిషాల క్రితం రాజశేఖర్ నిర్భయత్వానికి, నిజాయితీకి సంతోషించిన ఆనంద్, ఇప్పుడు మాధవితో అతని కున్న చనువును ఊహించుకొని మనసులో అసహ్యించుకున్నాడు.

'అసలు మాధవి చేస్తున్న పని వదిలి ఎందుకు వచ్చినట్లు? అతడిని చూడాలనే ఉద్దేశ్యం మాధవికి ఎందుకు కలిగింది? అతడు ముందే తెలిసి ఉండాలి మాధవికి. ఆ రోజు, ఆక్సిడెంటయిన రోజుకు ముందే అతణ్ణి కలుసుకుందేమో! అందుకే ఆ రోజు, అతడు ఎక్కడ బాధపడతాడోనని, అతడిమీద జాలితో, ప్రేమతో సంస్కారమంటూ, వ్యక్తిత్వమంటూ మోహన్‌తో వాదించింది. అతడూ మనిషేనని, అతడి లోనూ మానవత్వం ఉన్నదని అందుకే అంత ధైర్యంగా వాదించింది. తీయని మాటలతో నన్ను మోసగించింది. సంస్కారమనే ముసుగు వేసుకొని, ఎంత నాటక మాడింది! ఛీ, ఛీ.' మనసులోనే తీవ్రంగా అసహ్యించు కున్నాడు మాధవిని ఆనంద్.

* * *

"మీరు అదృష్టవంతులండి. అసలు వదినకు చెప్పుకోవాలి మీరు కృతజ్ఞతలు."

"దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు రాజా.

"మీ రెవరో అప్పుడు తెలియకపోయినా, వదిన మీ తరఫున నాతో వాదించింది."

"మీ వదిన సామాన్యమైన స్త్రీ కాదు, మోహన్. ఆమె మంచితనం నాకు తెలియనిది కాదు" అన్నాడు రాజా.

వింటున్న ఆనందరావు హృదయంలో ముల్లులా గుచ్చుకున్నవి ఈ మాటలు. మాధవి మంచితనంతో అతడికి ఇదివరకే పరిచయం ఉన్నదన్న మాట. మనసులోనే అసహ్యించుకున్నాడు ఆనంద్. తలనొప్పిగా ఉందనే వంకతో అక్కడినుండి లేచి తన గదిలోనికి వెళ్ళిపోయాడు.

ఎవరో స్నేహితుడు వచ్చాడని మోహన్ లేచి బయటికి వెళ్ళాడు.

మాధవి, రాజా మిగిలిపోయారు.

"రాజా! మీ చెల్లి ఎక్కడ ఉంది?"

"చెల్లికి పెళ్ళయింది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్నారు."

"మనవాళ్ళు ఎవరైనా కనిపించారా, రాజా? వనజా, రాధికా మన క్లాస్‌మేట్స్?"

"లేదు, మాధవీ! నేను గుంటూరు వదిలిపెట్టి రెండేళ్ళు అయింది. ఏమైనా ఆ రోజులు వేరు. బాధ్యతలూ, బరువులూ లేకుండా హాయిగా తిరిగే రోజులవి. కల్మషాలు, కలతలు లేకుండా భుజాలు కలుపుకొని, 'గురూ, గురూ' అంటూ మాట్లాడుకునే రోజులవి. జీవితంలో ఆ అనుభవాలు అలా మధురంగా గుర్తుంచుకోవలసిందే తప్ప ఇక తిరిగి రావు."

"అవును. అప్పుడున్న స్వేచ్ఛ, ఆనందం తిరిగిరావు." మాధవి గడిచిన జీవితాన్ని గుర్తుచేసుకుంటూ అన్నది.

"టైము ఏడు అయింది. నేనిక వస్తాను" అంటూ లేచి వెళ్ళాడు రాజా.

మాధవి భర్త దగ్గరికి వెళ్ళింది వెంటనే.

"తలనొప్పి తగ్గలేదా? మందు రాయనా?"

## మనం మనమేనా?

ఏది ? !

గండు కోయిల కూయదేం?
కొమ్మ చివురు మెరవదేం?
పిల్ల తెమ్మెర వీయదేం?
వెండి వెన్నెల కురవదేం?

చల్లని వేళలో . . .
వెచ్చని ఈ గాడ్పు లేమిటి?
కమ్మని భోజనంలో
కటుక్కుమనే యీ పలుగురాళ్లేమిటి?

'శాంతి హృదయం' మీద
యీ మూడు కోత లేమిటి?
కఠిన హృదయుల కిది
'హాపీ బర్త్ డే' కాబోలు . . .!

'కేకు' లాంటి 'సమైక్యత' మీద యీ
'మేకు' లేమిటి?
'మహానాగు' వంటి తెలుగువారి పరువు
కుటిలాత్ములయిన 'చలిచీమ' లకే ఫలహారమా?

'పిచ్చి' కుదిరింది,
రోకలి తలకి చుట్టు' మన్నట్లు —
ఈ వేర్పాటు ధోరణి లేమిటి?
ఈ మతిలేని వివాదాలేమిటి?

మనం మనమేనా?
మరో మనుషులమా? అస లదీ కాదా?
మళ్లీ జన్మంటూ ఉంటే
ఎత్తేది మనిషి జన్మేనా?

—కాటూరు రవీంద్ర త్రివిక్రమ్


## తెల్ల మచ్చలు

మేము గొప్పగా చెప్పుకోవడం లేదు. మా ఆయుర్వేద మందు "శ్వేత మోచన్" 3 రోజులలో రంగును మార్చి కొద్ది రోజులలో తెల్లమచ్చలను తొలగించును. వేలాది మంది ప్రశంసించారు. ప్రచారానికి ఒక బుడ్డి మందు ఉచితంగా పంపుతాము.

INDRA AYURVED BHAVAN (A),
P. O. Katrisarai (Gaya).

## వాయిదాలమీద ట్రాన్సిస్టర్

ప్రపంచ ప్రసిద్ధమైన 'సోనియో' జపాన్ మోడల్) 3 బాండ్ అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్ ఇప్పుడు ఇండియాలో కూడ, రు.10/-ల నెలసరి వాయిదాలమీద, లభిస్తున్నది. ప్రతి పల్లెకు, బస్తీకి పంపవచ్చును. వ్రాయండి



SONEO (INDIA)
P B. 1142, (WAP), Delhi-6.

## ఏజంట్లు కావలెను

100% టెరిలిన్ షర్టు ముక్కలు, పాంట్ ముక్కలు మరియు చీరెలకు కమిషనులేక రు. 225/- మంచి రు. 495/- ల వరకు జీతం మీద ఏజంట్లు కావలెను. నిబంధనలకు, పూర్తి సైజు విడివి ఉచిత శాంపిలుకు వ్రాయండి.

SHAKTI AGENCIES (WAP)
Qutab Road, Delhi-6

## ఉచితం ఉచితం ఉచితం



కాశ్మీరు, బెంగుళూరు ఆర్టు సిల్కు చీరెలు వనితల సౌందర్యాన్ని అతిశయింపజేయును. మనోహరమైన కొత్త రంగులలో, డిజైన్లలో తాజా స్టాకులు ఇప్పుడే వచ్చియున్నవి. పూర్తిసైజువి వెల 1 డీలక్సు చీరె రు. 13/90, 2 చీరెలు రు. 26/50, 3 చీరెలు రు. 38/10, 4 చీరెలు రు. 47/50. 2 లేక ఎక్కువ చీరెల ఆర్డరుమీద జుబ్బాముక్క, లిప్‌స్టిక్ ఉచితము. ఆర్డర్లమీద పోస్టు ఛార్జీలు ద్వారా పంపబడును. ఇంగ్లీషులో వ్రాయండి.

KASHMIR SALES (WAPV)
Kolhapur Road, Delhi-7.

